# "మరో ప్రపంచం"

★ శ్రీ కందుకూరి లింగరాజుగారు

విరుద్ధ ప్రవృత్తులు తప్పక ఒకళ్ళ నొకళ్ళని ఆకర్షించు కుంటా యేమో అనుకుంటా. నిజంగా చెప్పాలంటే రాజాకి నాకు కలయిక వాటి ఫలితమే అనవలసివస్తుంది. పొడుగ్గా ఆరడుగుల మనిషి, తిరిగీ తిరగని కండలు, కోలమొఖం, అందు దేన్నో వెతుక్కుంటూ అల్లాడిపోయేకళ్ళు చూస్తుంటే నాకే అర్థంకాకుండా ఉండేది. ఈనాడు కూడా అతను దేనికో, ఏదో సఫలీకృతం చేసుకోవాలన్న ఆశతోనే, జీవితాన్ని, సంతోషాలు సుఖ దుఃఖాలు, చంపుకుని నిర్జీవ వ్యక్తిత్వం ఏర్పరచు కున్నాడేమో!

ఆ మొదటిరోజుల్లో అనేవాడు. "నువ్వు చాలాభాగం సంసారంలోనుండి పుట్టేవు. దైవం, పూజలు పునస్కారాలు నిన్ను పెంచేయి. ఇట్లావుంటే ప్రపంచకం గురించి ఎప్పుడు ఆలోచిస్తావో" నిజంగా అతనన్నట్టు నేను సంసారిని. మా అమ్మ నన్ను ఆదర్శపత్నిగా, తలమానికంలా చెయ్యాలనే పెంచింది. నా అనే చిన్న ఇల్లు దిద్దుకుంటున్నానంటే, అదినాది అన్న భావనలో ఆమరత్వం చూస్తున్నానంటే గొప్పగానే ఉండేది. ఈ చిన్న మూలకిటికీల్లోవుండే దేవుడిపూజలు నన్ను ఆవృతంచేసేవి. దేవుడు లేందే ప్రపంచకంలేదు. దేవుని తెలుసుకుందుకు రాజా ఎందుకు ప్రయత్నించడూ అన్న వూహ.

తీరుబడిగా వున్నపుడు దొడ్లో పూలచెట్లకు నీళ్ళుపోసే దాన్ని. ఇంట్లో రాజా లేనంతకాలం నాకు అదేపని. ఏసమయంలోనైనా అతనుచూడ్డంతటస్థిస్తే "ఇదోపిచ్చి. అసలు నీతల్లో ఇల్లాటి పిచ్చివూహాలు చాలావున్నాయి" అంటాడు. అల్లా అనిపించుకోవడంలో కూడా ఓ సొగసు ఉందేమో అనుకుంటా.

ఆ రోజు కాబోలు! జీవితం దాని పరిణామం, రాచకీయాలు అవి వ్యక్తుల్కి ఎంత హుందా ఇస్తాయో చెపుతున్నాడు. నాకు నిజంగా అవి అనవసరమే! అవి నా జీవితాన్కి ఎందుకూ పనికిరావు. ఒక్కటిమాత్రం నాకు సమస్యగా వుండిపోయింది. ఇరవైనాలుగు ఘంటలూ, ఆ రాజకీయ పుస్తకాలు, వ్రాతలు, లెక్చర్లుఇస్తూ కూర్చుంటే, నా పంథా ఎల్లా ఆలోచిస్తాడా అని. సంసారం అనేది జీవితానికి తుదా? ఇది నిత్యస్వర్గం కాదా అని ..

"రాజకీయాలు నిజంగాజీవితాన్ని నిలబెడతాయా?..."

"నీ ఉద్దేశ్యం?" అతను అడ్డుగానే ప్రశ్నించేడు.

"మీ శాస్త్రాలు, వాదాలు, అన్నీ భౌతికం. అందులో తలా తోకాలేకుండా, కఫంలో ఈగలా కొట్టుకుంటూ, ఏదో చేసేంఅని గొంతెత్తి అరుస్తారు. అసలు మనల్ని నడిపేది భగవంతుడు. కర్మ అన్నదానిమీద ఈ జీవి నడుస్తుంది "

"అంతగా చెపుతున్నావే. నువ్వు ఆదేవుణ్ణిచూచేవా?" నెమ్మదిగా ఆస్వరంఉన్నా, హేళనఉండింది. నాకు కోపం ఒచ్చింది. "మీకువలె నేను పట్నవాసాల్లో పుట్టలేదు. ఈ రాజకీయాలు, అంతఃకలహాలు నాకు తెలియవు. ప్రకృతి సౌందర్యంలో, ఆ ఆనందంలో, విశాల దైవలీలల్లో నేను పెంపబడ్డా. పెరిగే. నేను నా భావనలో దేవుణ్ణి చూడగలిగేనేమో..."

నవ్వేడు. ఈ కోణలిలోనుండి ఆలోచన అన్నదే అతనికి నవ్వులాటగావుంది. అది అక్కర్లేని విషయం. పిచ్చి. క్షణికం ఆలోచన కల్గినా దాన్ని క్రూరంగా చంపేసేడేమో అని తోచింది.

"భగవద్గీత చదవలేదా?"

"ఎందుకూ"

ఈ నాస్తికుడికి ఏం సమాధానం ఇవ్వనూ?

"జీవితంలో భగవద్గీత చదువుతూ కూర్చుంటే, మానవునకు చైతన్యం ఒస్తుంది. దేవుడువచ్చి మనల్ని స్వర్గానికి తీసుకు వెడతాడు కాదూ?"

ఏం చెప్పనూ? దూరతీరాల్ని ఎల్లాచూడను? లేచి వెళ్ళుతూనే "దేవుడునన్ను పాపిగా ఎంచి నరకాన్కి తీసుకు వెళుతాడు. నువ్వు .."

వెళ్ళిపోయేడు. కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. జీవితం ఇల్లా గడచి పోవలసిందేనా? కళ్ళు తుడుచుకుంటుంటే హృదయం గోలెడుతోంది. సందిగ్ధం...?

ఇల్లా జరిగినా ఆరాత్రిళ్ళు దగ్గరగా, తీసుకున్నపుడు మాత్రం 'సుందరీ! నువ్వులేకపోతే నేను లేనేమో!' అని రహస్యంగా అనేవారు. చుట్టూరావున్న ప్రకృతి రహస్యంగా మైకంపోసేది. అతని కౌగిట్లో మర్చిపోయే, ఏదో హృదయం సంగీతం పాడేది.

* * * *

మా పెళ్ళిఅయి సంవత్సరం గడిచిపోయింది. మొదట్లో మా ప్రవృత్తులు ఒకళ్ళనొకళ్ళు విమర్శించుకొన్నా, రోజు రోజుకూ అది రాజాలో ఎక్కువేఅయ్యేది. ఆ సమయాల్లో నేను చెప్పినది సమంజసంగా వుందా లేదా, అని నిలబెట్టి ఒప్పించే స్థితికూడా ఒచ్చేది.

లోపలమాత్రం నాకు బెంగగానే వుండేది రాజా విషయంలో! నన్ను వెగటుగా "అందులో, ఇందులో నువ్వు దేవుణ్ణి చూస్తున్నావు కాబోలు" అనడం తప్పేనికాదు. ఆఖర్కి అది ఏపువ్వుల్ని కోసేటప్పుడైనా, కూర పోపు పెట్టేటప్పుడైనా సరే...

ఆ పండక్కి లక్ష్మివచ్చింది. వూచలావున్నా, చలాకీగా వుండే ఆమెనుచూస్తే నాకు ఆనందంగా వుండేది. చేస్తున్న ఉద్యోగం శెలవుపెట్టి నన్ను చూడడానికి వచ్చింది.

ఆరోజు అంతాకలిసే భోజనం చేస్తున్నాము. లక్ష్మి నవ్వుతూనే నా వంటకాలని మెచ్చుకుంటోంది.

నవ్వుతూనే "సుందరి వంటింటి మహాలక్ష్మి."

"పిల్లలువుంటే కలకల్లాడే లక్ష్మిలాగే వుంటుంది" వాలుగాచూస్తూ లక్ష్మి.

"పిల్లలూ! సంసారం పిల్లలనే జిగురుతో అంటించబడ్డం అనేది నాకక్కర్లేదు. అది మూర్ఖత్వం"

రాజా ఇల్లా అనడం నాకు కోపమే వచ్చింది. బాధ కల్గింది.

"భార్యకావాలి కాని పిల్లలక్కర్లేదు" నాలో విప్లవం.

"పిల్లలు. వాళ్ళనుగురించి ప్రపంచకం, వంశం నిలబెట్టేం అనుకుంటారు. అంతకంటే క్రూరత్వం ఇంకోటి లేదేమో! ఈ స్థితిలో వాళ్ళునిజంగా ఆటంబాంబు లాంటివాళ్ళు."

లక్ష్మి ఖంగారుపడింది, మాలోని ఘర్షన ఎక్కువౌతుందేమో అని. నాకుమాత్రం ఆక్షణంలో పిల్లలు ఉంటే-ఆశ ఆవరించింది. ఏదో మధురత ఉన్నట్టేవుంది...

వెళుతున్నప్పుడే లక్ష్మిఅంది. 'నువ్వు నీ 'స్వం' కోసమే ప్రాకులాడుతున్నావ్. కోణంలో నువ్వు ఆలోచించావా? ఈనాడు రాజా ఇల్లా మారాడంటే ఎందుకో అని వూహించేవా?' అంది.

ఆతలంపు నాకు ఆట్టేకాలం వుండనేలేదు. రాజా రాజకీయ పనులమీద ఊళ్ళోతిరుగుతూనే ఉన్నాడు. ఆ అలసిపోయిన శరీరంను ఇంకా శ్రమపెడుతూనే ఉన్నాడు. ఏదో సమయంలో రావడం, వెళ్ళడం గూడా జరిగిపోయేది. ఆ రాత్రిళ్ళల్లో మనసారగా మాట్లాడాలి. ఏదో అనుకునే దాన్ని. కాని అది అతీతం అయిపోయేది.

ఆరోజు సాయంత్రం తిరిగి వచ్చేడు. కళ్ళక్రింద నలుపు నిద్ర లేదన్నట్టేవుంది. బడలిన మొఖంలో బాధ కన్పిస్తోంది. ఒళ్ళు చూచే నిప్పులు కాగుతోంది. పడుకోమని డాక్టర్ను పిలిచే...'విశ్రాంతి' చెప్పేడు ..

'మా వూరు వెళదాం'

'ఆ పల్లెటూరా?'

"మీకు శాంతి, విశ్రాంతి, ప్రకృతి ఇస్తుంది. అందులో..."

"ప్రకృతి! కాపురం ఉండడాన్కి మనుషులు కరువైనందున, దుబ్బుగా పెరిగిన ముళ్ళపొదలు, డొంకలూ ప్రకృతా? అందులో దేవుడు అందం మలచిపెట్టేడా?..." అయినా.

ఇద్దరం వెళ్ళేం. పెట్టెలనిండా పట్టలేనన్ని పుస్తకాలు తక్కి ఆయన బళ్ళునింపేడు. నాకుమాత్రం అది ఓర్చుకో లేని విషయమే అయ్యింది, ఈ అనుకుని, ఆశించుకున్న

విశ్రాంతి రాకుండా చదువుతూ మరింత దిగనాయతాడేమో అని.

గడబిడగావుండే పట్నం వాసనల్లోనుంచి, ఊగేచెట్లు, పసిరిక వాసనల్లోకి వచ్చినందుకు నాకు సంతోషంగావుంది, పుట్టి పెరగడం, అల్లాంటి వాతావరణాల్లోనే కాబట్టి. ఈ పొలాలు, దూడలు, సాయంత్రపు సంధ్య, ఇంట్లో పని పాటలు చూచుకోవడంతో మునిగిపోయే. విముఖతతో, తప్పని సరిగా వచ్చిన రాజాని ఆతని వూహాలకు, చేతలకు పూర్తిగా వదలివేసే. ఈనాడు నాలో నిబిడీకృతం అయిన సౌందర్యపిపాస, దైవత్వ ఉపాసన, నేను బోధించడానికి ప్రయత్నించలేదు. కాని ఒక్కటే—రాజా అనుగుణ్యంగా తన వాతావరణాన్ని అనునయం చేసుకోగల్గుతాడన్న ఆశ.

రోజూ సాయంత్రం గోదావరి ఒడ్డుకు వెళ్ళేవాడు. ఇంటికి తిరిగివచ్చే పశువులు, అస్తమిస్తున్న సూర్యుడు, వచ్చే చల్లగాలి ఇవి చూస్తూంటే అతను ఆలోచించేవాడు. ఆలోచనలు క్రియారూపం లేకుండా ఉండం పిచ్చి ఎత్తినట్లే ఉండేది. ఆ అశాంతిలో అతను చిరాగ్గా వుండడం నాకు తెలుసు.

నేను ఆవూళ్ళోకి వచ్చేనని, చాలామంది చూడ్డానికి వచ్చేవారు. రాజాకి పరిచయంచేసే. ఈ తోచని విరక్తి సమయాల్లో వాళ్ళతో కలసి, ఈ పల్లెల్లోకి వెళ్ళేవాడు. ఈ వెళ్ళడంలో మొట్టమొదట ద్వేషం చూపించినా, క్రమేణా ఓవిధమైన ఆసక్తి కలగడం నాకు సంతోషంగానే వుంది.

ఆ రోజుల్లోవచ్చి, 'ఈనాడు నేను సముద్రంలో ఉండే జంతుజాలాన్ని అంతాచూచివచ్చేను' అనో, 'వాళ్ళు కోత కోస్తున్నారు, వీళ్ళ ఆవు ఈనింది, వాళ్ళు తమ తగాదాలను పెద్దల దగ్గర ఇల్లా తీర్చుకున్నారు. నన్నుకూడా మధ్యవర్తిగా వుండమన్నారు' అనో చెప్పేవాడు. ఆ చెప్పడం, నేను ఇంకా వినాలనే ఉండేది.

ఇవన్నీ నాకు తెలియని సత్యాలుకావు. ఈ పట్నంలో పుట్టి, మురికిరాజకీయాల్లో నాయకుల్ని, అనామకులుగా ఆస్థి పాస్తుల్ని అమ్ముకునే జీవనాన్ని, అలవాటుపడ్డ వ్యక్తుల్ని, అసలు జీవనం అంటే ఏవిధంగా వుంటుందో తెలుసుకోడం కూడా వింతగానే వుంటుంది. ఈ పల్లెలు అంటే ఏం దాచుకున్నా యెక్కడా తెలియక ఉండడం మూర్ఖత్వం అవుతుందేమో!

రోజులు గడుస్తున్నాయ్! తనకి తీరుబడి లేకుండానే పనిచేస్తూవుండేవాడు. అందులోతృప్తి—కళ్ళక్రింద నలుపు, ఎముకలు కప్పడం, రక్తపు ఎరుపు మార్పు తెచ్చింది. ఆ మొఖంలో ఆలోచన ఇప్పుడు మాయమైంది. ఆధారం, జీవితం అన్నది ఇప్పుడు తెలుసుకున్నాడా అనిపించేది.

ఆరాత్రి ఇద్దరమూ ఏదో చర్చించుకుంటున్నాం. వాదోపవాదాలు ఎక్కువగానే జరిగేయి. కానీ నాకే ఉండుండి నవ్వు ఆగిందికాదు. కారణం మేమిద్దరం ఒక్క పంథాను గురించే దెబ్బలాడుతున్నాం.

"ఎందుకు నవ్వుతావ్"

"మనం ఇద్దరం చాలా విషయాల్లో ఏకమైపోతున్నాం."

అతను ముఖం వంచుకునే "నీ పల్లెటూరి ప్రపంచకాన్ని నామీద రుద్దుదామనుకున్నావా?"

"నేను ఒక్కవిషయం మీమీద పెట్టలేదు. చెప్పలేదు. మీరే మారేరు. ఆ మార్పు ఎంత పెద్దదైనా, చిన్నదైనానే నెల్లా కారణం"

"అందుకే నువ్వు నన్ను మీవూరు తీసుకువచ్చేవా?"

"మీ ఆరోగ్యంకు వచ్చేం."

అతను కళ్ళల్లోకి చూచేడు. కిటికీలో నుంచి బయట గులాబీలు తలలూపుతున్నై. మెట్లు ఎక్కుతున్న పెద్దకాపు కిర్రు చెప్పులు శబ్దం చేస్తున్నాయ్ తంబురా లా!"

* * * *

ఆ వేసవి ప్రారంభలోనే మశూచికం వచ్చింది. ఆ రోజుల్లో మాకు నిద్రే ఉండేదుకాదు. ఇద్దరం, ఈ పల్లెలో చాకిరీచేసేం. నిజంగా అది హృదయాల్లోనించివచ్చిన త్యాగమేమో! ప్రేమ...

ఈ అస్పృశ్యుల ఇండ్లలోకికూడా మేం వెళ్ళడం ఆశ్చ

ర్యంగా ఉండేది. వాళ్ళు భయపడేవారు. ఆనాడు నాకు నవశక్తిని పోసినవాడు రాజా ఏమో అనిపించింది. మాఫలం అన్నా, దైవఇచ్ఛ అన్నా ఆరోజులు మాకు దక్కేయి.

ఆ జాతర్లో, రాజాకూడా పాల్గొన్నాడు. నాకే ఆశ్చర్యం కల్గుతోంది. ఊరవతల కుంభంపోసి దేవతని సాగనంపి ఇంటికి వచ్చేం.

ఆ రాత్రి, చల్లని వెన్నెట్లో, నక్షత్రాలు మిళుక్కుమంటున్నాయ్. నా ప్రక్కగా కూర్చున్నాడు రాజా, పడినశ్రమని, చల్లటి గోదావరిగాలి ఆరుస్తోంది.

నడుంమీద చెయ్యి వేస్తూనే 'సుందరీ! నేనే పొరపాటు పడ్డానేమో! ఫలితంలేని జీవనం నాపట్నం ఆశలు భగ్నమయ్యే త్యాగం అది. కాని ఈపల్లె జీవితాన్ని మెరుగులే పెడుతుంది. నేనే పొరపడ్డానేమో రాజకీయాల్ని గురించి. ఈ మానవసేవలోనే దైవం తనకృపల్ని కలిపి వున్నాడేమో! ఇదేనా నిజమైన జీవితం," అన్నాడు.

కళ్ళమ్మటనీళ్ళు ఆనందంలో క్రమ్ముకున్నై.

"లక్ష్మి చెప్పినమాటలు జ్ఞాపకం ఉన్నాయా?"

"నిజంగా!" సిగ్గుపడ్డా. ఆ కండలు తిరిగి, శాంతతలో ఉన్న ఛాతీమీద ఆనుకునే, ఆతని కౌగిలిలో కరిగిపోయే.

కన్నీళ్ళు, ముత్యాల్లా బుగ్గలమీద పడ్డాయి.

"రాజా! అమరంలో ఉన్నావా?"

"సుందరీ!"

★

# కాలవాహిని

తరుణి రాతిరి కురులలో నిరుల సోరిది
ప్రీతి నిదురించు పసిమది పీడ కలలు
కాలుకీలల కార్చిచ్చు కాల మిపుడు
నానిపోయిన పొరటల నాటిమాట

మొగ్గతొడుగదు చిగురించి మొండిమ్రాను
గొంతు సవరించి పాడదు కోకిలమ్మ
నిదురవదలదు; కదులదు నిదురమత్తు.
నిదుర కంకిత మయ్యెనే నేడు వీడు?

తెలుగు వెలుగుల విలసిల్లి యలరు నాడు.
తెలుగు కోకిల క్షీరాబ్ధి చిలుకు నాడు
తెలుగు చెట్లన్ని చిగిరించి చెలగు నాడు
రేపెవచ్చెడి నానాడు ప్రియసఖుండ.

శ్రీ గుంటపల్లి రాధాకృష్ణమూర్తిగారు

★